నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 26 ఫిబ్రవరి 2025 | SURYAPET


## 28న సైన్స్ సంబురాలు నిర్వహించాలి : డీఈఓ


రామగిరి, ఫిబ్రవరి 25: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో వైజ్ఞానిక సంబురాలు నిర్వహించాలని డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు సైన్స్ క్విజ్, సైన్స్ పోస్టర్ పెయింటింగ్, సైన్స్ పుస్తకాలపై అవగాహన, సైన్స్ ఎగ్జిబిషన్ మొదలైనవి నిర్వహించాలని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన వివరాలను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి హైదరాబాద్‌కు మార్చి 5లోగా పంపించాలని, gscertmathsscience@gmail.com కూడా పంపించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని సంప్రదించాలని పేర్కొన్నారు.

## 28 నుంచి బీఈడీ థియరీ పరీక్షలు

రామగిరి : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంజీయూ పరిధిలో ఈ నెల 21న ప్రారంభమైన బీఈడీ మూడో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 28 నుంచి థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు.


మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

# ప్రచారం పరిసమాప్తం.. తెరపైకి ప్రలోభ పర్వం




## టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థుల మధ్యే తీవ్ర పోటీ

- పలువురు అభ్యర్థుల డబ్బు, మద్యం పంపిణీ షురూ
- ఓటుకు రూ.2 వేల నుంచి 3వేల వరకు ఖర్చు
- ఇప్పటికే పంపిణీ పూర్తి చేసిన ఇద్దరు అభ్యర్థులు?
- నేటి రాత్రి వరకు విందులకు ఏర్పాట్లు
- రేపు ఉదయం 8గంటల నుంచి పోలింగ్
- ఓటర్లు, పోలింగ్ కేంద్రాల్లోని విద్యాసంస్థలకు సెలవు
- నేడు పోలింగ్ సెంటర్లకు సామగ్రితో సిబ్బంది

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి25(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడింది. సైలెన్స్ పిరియడ్ అమలులోకి రావడంతో అంతా గప్‌చుప్‌గా మారింది. ఇన్ని రోజులు సభలు, సమావేశాలు, ర్యాలీలతో ప్రచారం చేసిన అభ్యర్థులు ఇప్పుడు ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు చివరి అస్త్రాలపై దృష్టి సారించారు. తమ ప్రచార అంశాలపై నమ్మకం కుదరని కొందరు ప్రధాన సంఘాల అభ్యర్థులు ప్రలోభాలపైన గురి పెట్టినట్లు చర్చ సాగుతున్నది. ఓటరు వారీగా ప్రత్యేక సర్దుబాటుకు సిద్ధమై ఓటుకు నోటుతోపాటు మద్యం, విందు కార్యక్రమాలకు తెర లేపారు. సోమవారం సాయంత్రం నుంచే కొందరు అభ్యర్థులు ఒక్కో ఓటరు వారీగా యూపీఐ చెల్లింపులు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో స్క్రీన్ షాట్లు హల్‌చల్ చేస్తున్నాయి. మంగళ, బుధవారాల్లో మరికొంత మంది అభ్యర్థులు ఓటర్లపై డబ్బు, మద్యం ప్రయోగిస్తూ ఓట్లను ఆకర్షించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో ఓటుకు 2 వేల రూపాయల నుంచి 3వేల వరకు చెల్లింపులు కొనసాగుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఖరీదైన మద్యం బాటిళ్లతో రెండు రోజుల పాటు దావత్‌లు కూడా షురూ అయినట్లు సమాచారం. సమాజంలో మార్గనిర్దేశకులుగా గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ వర్గాల ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనంతగా ప్రలోభాల చుట్టూ తిరుగుతున్నది.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల ఘట్టం కీలకమైన పోలింగ్ దశకు చేరుకున్నది. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉండగా, ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం ఉదయం 8 గంటల నుంచి నియోజకవర్గం పరిధిలోని 12 జిల్లా కేంద్రాల్లో డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ సిబ్బంది సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. గురువారం ఉదయం సరిగ్గా 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. 12 జిల్లాల పరిధిలోని 191 మండలాల్లోని మొత్తం 200 పోలింగ్ కేంద్రాల్లో 25,797 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం తెలిసిందే. వారిలో ప్రధాన సంఘాల అభ్యర్థుల్లో కొందరు ఓటరు నమోదు నాటి నుంచే ప్రచారంలో మునిగి తేలారు. మరికొందరు నామినేషన్ల దాఖలు నుంచి ప్రచారం మొదలు పెట్టారు. ఇందులో యూటీఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ-టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో టీచర్స్ జాక్ అభ్యర్థి పూల రవీందర్, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజు వంటి ప్రధాన సంఘాల అభ్యర్థులు గెలుపు తమదేనంటూ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. సుడిగాలి పర్యటనలు చేస్తూ అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తమ వ్యూహాలను వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేశారు. మంగళవారం సాయంత్రం 4గంటల వరకు అభ్యర్థులంతా ప్రచారంలోనే ఉన్నారు. కొందరు అభ్యర్థులు ఓట్లపై ఇంకా నమ్మకం కుదరక అంతర్గత సర్దుబాట్లపై దృష్టి సారించారు.

### నేడు పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

బుధవారం సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గం పరిధిలోని 200 పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో పోలింగ్ సిబ్బంది చేరుకోనున్నారు. 12 జిల్లా కేంద్రాల్లోని 12 డిస్ట్రిబ్యూటరీ సెంటర్లలో ఉదయం 8గంటల నుంచి పోలింగ్ సిబ్బందికి స్టేషన్ల కేటాయింపును పూర్తి చేస్తారు. రూట్ల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో సిబ్బంది సామగ్రితో మధ్యాహ్న భోజనం తర్వాత బయల్దేరి వెళ్లనున్నారు. సాయంత్రానికి పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారు. పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యా సంస్థలు, కార్యాలయాలకు గురువారం స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదై ఉన్న వాళ్లకూ సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

### ఓటుకు గరిష్ఠంగా రూ.3వేలు..

ఈ ఎన్నికల్లో ఓటుకు గరిష్ఠంగా మూడు వేల రూపాయల వరకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. వరంగల్‌కు చెందిన ఓ ప్రధాన సంఘం అభ్యర్థి ఓటుకు 2వేల చొప్పున దాదాపుగా పంపిణీ పూర్తి చేశారు. బీసీ వాదంతో రంగంలో ఉన్న అదే జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి రూ.3వేల వరకు ముట్టచెప్పున్నట్లు తెలుస్తున్నది. ఇక అదే జిల్లాకు చెందిన ఓ ప్రధాన జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి సైతం 2 వేల వరకు మంగళవారం రాత్రి నుంచే పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు చర్చ జరుగుతున్నది. ఓ పార్టీ అధికార ప్రతినిధి హోదాలో ఉన్న అభ్యర్థి కూడా ఓటుకు 2వేల చొప్పున యూపీఐ చెల్లింపులు చేస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ ప్రధాన అభ్యర్థి సైతం సోమవారం సాయంత్రం నుంచే ఓటుకు 2వేల చొప్పున యూపీఐ చెల్లింపులు ప్రారంభించినట్లు స్క్రీన్ షాట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇక సిట్టింగ్ ఎమ్మెల్సీ ప్రాతినిధ్యం వహిస్తున్న యూటీఎఫ్ సంఘం నేతలు మాత్రం అభ్యర్థి వ్యక్తిత్వాన్ని, ప్రచార అంశాలనే నమ్ముకున్నారు. దాంతో ఇతర అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఓ అభ్యర్థి జిల్లాలను బట్టి వెయ్యి రూపాయల నుంచి రూ.5 వేల వరకు, మరో అభ్యర్థి 2 వేల నుంచి 5వేల వరకు, ఇంకో అభ్యర్థి 2వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపించారు. కొందరు ప్రధాన సంఘాల అభ్యర్థులు వాళ్లు దిగజారి ఉపాధ్యాయ విలువలను సైతం దిగజారుస్తున్నారని మండిపడుతున్నారు. చేసిన సేవలను చెప్పుకోలేక డబ్బు, మద్యం పంపకాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్క శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. డబ్బు పంపిణీకి ఎన్నికల కమిషన్ తక్షణమే అడ్డుకట్ట వేయాలని, మందు, నగదు పంపిణీ చేస్తున్న అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి పీడీఎస్‌యూ వినతి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 25 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20శాతం నిధులు కేటాయించేలా అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని పీడీఎస్‌యూ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ దాదాపు 8వేల కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా బకాయిలను విడుదల చేయలేదని తెలిపారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా సంస్థలకు నిధులు, మౌలిక సదుపాయాలు లేక అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం ఇచ్చినట్లు 20శాతం నిధులు కేటాయించేలా సర్కారుపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు అందడి శ్రీధర్, కిరణ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- మెనూ పాటించని ఎస్టీ హాస్టల్ వార్డెన్ తొలగింపు

బొమ్మలరామారం, ఫిబ్రవరి 25 : బొమ్మలరామారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పద్మను కలెక్టర్ హనుమంత రావు మంగళవారం సస్పెండ్ చేశారు. ఇంటి పన్నులను ఆన్‌లైన్ చేయకుండా అధికారులను తప్పుదోవ పట్టించడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో చర్యలు తీసుకున్నారు.

భువనగిరి అర్బన్ : భువనగిరి పట్టణ పరిధి సింగన్నగూడెం సమీపంలో గల ఎస్టీ హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మిని కలెక్టర్ హనుమంతరావు సస్పెండ్ చేశారు. ఎస్టీ హాస్టల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మి నూతన మెనూ పాటించలేదని గతంలో షోకాజ్ నోటీసు ఇచ్చినా తీరు మారకపోవడంతో విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఏ హాస్టల్‌లో కూడా మెనూ పాటించక పోయినా, నాణ్యమైన భో జనం పెట్టక పోయినా సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.









## ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

### అమల్లో 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ – ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్



సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 25 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మొత్తం 23 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 300 మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్(144) అమలులో ఉంటుందని, పోలింగ్ బూత్‌ల వద్ద 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నియమావళి ప్రకారం ఆంక్షలు ఉంటాయని తెలిపారు. ఓటర్లు గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని, ఘర్షణలకు దిగడం, బయట ప్రచారం చేయడం వంటివి చేయొద్దని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు పోలింగ్ బూత్‌లోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. బూత్ అధికారి అనుమతి లేకుండా పోలీసులు కూడా బూత్ లోపలికి వెళ్లొద్దని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

## విధుల్లో నిర్లక్ష్యం.. గుర్రంపోడు తాసీల్దార్ సస్పెన్షన్


జి.కిరణ్ కుమార్

గుర్రంపోడ్, ఫిబ్రవరి 25 : విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతోపాటు జిల్లా యంత్రాంగం ఆదేశాలను బేఖాతరు చేసిన గుర్రంపోడు తాసీల్దార్ జి.కిరణ్ కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కిరణ్ కుమార్ విన్నపం మేరకు గత నెల 6 నుంచి 16 వరకు కలెక్టర్ సెలవు మంజూరు చేశారు. జనవరి 17న విధుల్లో చేరాల్సి ఉండగా, సెలవును ఆ నెల 31 వరకు పొడిగించారు. తిరిగి ఫిబ్రవరి ఒకటి నుంచి 28 వరకు సెలవును పొడిగిస్తూ దరఖాస్తు పెట్టారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం, రేషన్ కార్డులు, రైతు భరోసా వంటి పథకాల లబ్ధిదారుల ఎంపికతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ సెలవు మంజూరు చేయలేదు. ఈ అంశాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని వెంటనే విధుల్లో చేరాలని సూచించినా విధులకు హాజరు కాలేదు. దీనిపై వివరణ ఇవ్వాలని కిరణ్‌కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నోటీసుకు స్పందించకపోవడం, విధుల్లో చేరకపోవడం వల్ల ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలులో జిల్లా యంత్రాంగానికి ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో తాసీల్దార్ జి.కిరణ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని, సస్పెన్షన్ కాలంలో సెలవులో ఉన్న తాసీల్దార్ కిరణ్ కుమార్ ముందస్తు అనుమతి లేకుండా కార్యస్థానం వదిలి వెళ్లకూడదని కలెక్టర్ ఆదేశించారు.

## యూరియా కోసం బారులు

హాలియా, ఫిబ్రవరి 25 : ఆరుగాలం కష్టపడి అందరికీ అన్నం పెట్టే రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం సహకరించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు బారులుదీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాలియాలోని కొత్తపల్లి సహకార సంఘ కార్యాలయం ఎదుట మంగళవారం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిలబడడం కనిపించింది. అనుముల, తిరుమలగిరి సాగర్ మండలాల్లోని పలు గ్రామాల నుంచి రైతులు యూరియా కోసం ఉదయం ఏడు గంటలకు కొత్తపల్లి సహకార సంఘ కార్యాలయం వద్దకు వచ్చారు. ఏమీ తినకుండా రావడం, దాహం తీర్చుకోవడానికి కూడా కనీసం నీళ్లు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వరకు హైదరాబాద్ నుంచి రెండు, మార్క్‌ఫెడ్ నుంచి ఒక్క లారీ యూరియా హాలియాకు రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సహకార సంఘ సిబ్బంది యూరియా పంపిణీని మొదలు పెట్టడంతో యూరియా దొరుకుతదా లేదా అని రైతులు ఎగబడ్డారు. ఉదయం నుంచి పనులు మానుకొని ఎండలో నిలబడి యూరియా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్‌కు డబ్బులు కట్టినప్పటికీ అక్కడ యూరియా స్టాక్ లేకపోవడంతో సకాలంలో పంపలేదని సహకార సంఘ కార్యాలయ సిబ్బంది తెలిపారు. మంగళవారం వచ్చిన 1,565 బస్తాల యూరియాలో 141 మంది రైతులకు 1,500 బస్తాలు విక్రయించినట్లు చెప్పారు. యూరియా కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని, సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి సరిత తెలిపారు.



యూరియా కోసం కొత్తపల్లి సహకార సంఘ కార్యాలయం ఎదుట క్యూలో రైతులు

## తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- కుర్మేడులో ఖాళీ బిందెలతో ధర్నా


చింతపల్లి మండలం కుర్మేడులో ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

మాల్, ఫిబ్రవరి 25 : వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడులో మంగళవారం సాగర్-హైదరాబాద్ రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కుర్మేడులోని పద్మశాలి నగర్ కాలనీకి వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. తాగునీళ్లు రాక ప్రైవేట్‌లో వాటర్‌ను కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హైవేపై సుమారు గంట సేపు ధర్నా నిర్వహించడంతో పోలీసులు వచ్చి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ధర్నా స్థలానికి వాటర్ గ్రేడ్ ఏఈ లింగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్‌తోపాటు పలువురు అధికారులు వచ్చి మహిళలతో మాట్లాడారు. పైపు లైన్లు లీకేజీ కావడంతో నీళ్లు అందించలేకపోయామని, రెండ్రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


విద్యుత్ దీపాల వెలుగుల్లో పిల్లలమర్రి ఎరుకేశ్వరాలయం

## నేడు మహా శివరాత్రి

### ముస్తాబైన ఆలయాలు.. ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఆది భిక్షువు, ముక్కంటికి ప్రీతిపాత్రమైన పర్వదినం నేడే. బుధవారం మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలో ప్రముఖ ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అభిషేకాలు, పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల స్వామివారి కల్యాణోత్సవాలు, సాంస్కృతిక ప్రదర్శనలకు సిద్ధం చేశారు. భక్తులు ఉపవాసాలతోపాటు జాగరణతో పరమ శివుడిని కొలువనున్నారు. పూలు, పండ్లు, పూజా సామగ్రి అమ్మకాలతో మంగళవారం మార్కెట్లు సందడిగా కనిపించాయి.